నమస్తే తెలంగాణ

# రంగారెడ్డి

I హైదరాబాద్, ఆదివారం 15 డిసెంబర్ 2024 | RANGAREDDY


## మాదకద్రవ్యాల నియంత్రణకు..
## అవగాహన కార్యక్రమాలు

సిటీబ్యూరో, డిసెంబర్ 14(నమస్తే తెలంగాణ): డ్రగ్స్ బారిన పడి విద్యార్థులు, యువత తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. మాదకద్రవ్యాల బారినపడి వాటి నుంచి బయటపడటానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో మాదక ద్రవ్యాల నియంత్రణకు జిల్లా విద్యాశాఖ చర్యలు చేపట్టింది. హైదరాబాద్‌లోని సర్కారు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో చైతన్యం నింపడానికి ప్రత్యేక అవగాహన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా తొలుత కొన్ని పాఠశాలలను ఎంపిక చేసి డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తారు. ఇందుకోసం సైకాలజిస్టుల సేవలు కూడా వినియోగించుకోనున్నారు. డ్రగ్స్ వినియోగిస్తే ఎలాంటి నష్టాలు, అనారోగ్య సమస్యలు కలుగుతాయో వివరించనున్నారు.మండలాల వారీగా పాఠశాలల్లో డ్రగ్స్ అవేర్నెస్ యాక్టివిటీ చేపట్టబోతున్నట్టు అధికారులు తెలిపారు. విద్యార్థుల బంగారు భవిష్యత్‌లో టీచర్ల బాధ్యత ఎంత ఉందో.. తల్లిదండ్రులది కూడా అంతే ఉంటుందన్నారు. విద్యార్థులను తీర్చిదిద్దడంలో పేరెంట్స్ పాత్రపై కూడా వారికి అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు.

### శరీరమంతా నొప్పిగా ఉన్నది..



ఉడికీఉడకని ఆహారం తినడం వల్లే వాంతులు, విరోచనాలు అయ్యాయి. శరీరమంతా భరించలేని నొప్పి ఉన్నది. మళ్లీ హాస్టల్‌కు వెళ్లాలంటే భయంగా ఉన్నది. మంచి భోజనం, టిఫిన్ పెట్టరు. కొన్ని నెలలుగా భోజనం లేక, ఎవరికి చెప్పాలో అర్థం కాక చస్తున్నం. ఇదేమి ఆహారమని సిబ్బందిని అడిగితే పట్టించుకోకపోగా, మమ్మల్ని వేధించేవారు. వారిపై చర్యలు తీసుకోవాలి.

– గాయత్రి, 8వ తరగతి

### ఇప్పుడు కాస్త బాగుంది..



దవాఖానకు వచ్చాక ఆరోగ్యం కాస్త బాగుంది. కానీ లేచే ఓపిక లేదు.. నీరసంగా ఉన్నది. కలుషిత ఆహారం పెట్టిన హాస్టల్ సిబ్బందిని సస్పెండ్ చేయాలి. మా పరిస్థితి ఇలా ఉన్నదని అమ్మనాన్నలు, బంధుమిత్రులు ఎంత బాధపడున్నారో. దయచేసి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఇప్పటికైనా నాణ్యమైన భోజనం, టిఫిన్ పెట్టాలి.

– దీపిక, 6వ తరగతి

## ఇటు వేడుక

# ఇక నుంచి..పౌష్టికాహారం

**భోజనంలో నాణ్యత పాటించాలని అధికారులు, ప్రజాప్రతినిధులను ఆదేశించాం**

**చేవెళ్ల గురుకుల పాఠశాలలో సీఎం రేవంత్‌రెడ్డి**

**డైట్ మెనూ కార్యక్రమాన్ని ప్రారంభించి విద్యార్థులతో కలిసి భోజనం చేసిన ముఖ్యమంత్రి**




విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

మొయినాబాద్, డిసెంబర్ 14 : అంతర్జాతీయ ప్రమాణాలతో నాణ్యమైన విద్యను అందించేందుకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాల సముదాయాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన కామన్ డైట్ మెనూను మొయినాబాద్ మండలం.. చిలుకూరు గ్రామంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల/కళాశాలలో శనివారం ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి సీఎం ప్రారంభించారు. గురుకుల పాఠశాలలో చదివి మద్రాస్‌లో ఐఐటీ సీట్ సంపాదించిన వై.సాయిరాం, ఉస్మానియా మెడికల్ యూనివర్సిటీలో ఎంబీబీఎస్ సీట్లు సాధించిన శృతి, హేమంత్‌లకు ముఖ్యమంత్రి ల్యాప్‌టాప్‌లను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే కాలె యాదయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ అన్ని గురుకుల పాఠశాలలను ఒకే సముదాయంలోకి తీసుకొచ్చేందుకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాల సముదాయాలను నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిందన్నారు. విద్యా వ్యవస్థను పటిష్టం చేసేందుకే ఆ శాఖను తన వద్దే ఉంచుకున్నట్లు చెప్పారు. విద్యా సంస్థలు, గురుకుల పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లకు సంబంధించిన నిధులను ప్రతి నెలా 10వ తేదీలోపు గ్రీన్ చానల్ ద్వారా విడుదల చేయాలని ఈ మధ్యనే ఆర్థిక శాఖ మంత్రిని, అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. డైట్ చార్జీలు 40 శాతం, కాస్మెటిక్ చార్జీలు 200 శాతం పెంచామన్నారు. నిరుద్యోగ సమస్య నిర్మూలన కోసం రాష్ట్రంలోని 75 ఐటీఐలను టాటా సంస్థతో కలిసి అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేస్తున్నామన్నారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా నిరుద్యోగులకు నైపుణ్యాలను అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. 2028 ఒలింపిక్స్ లక్ష్యంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ అకాడమీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు ఉచితంగా విద్యుత్తు సరఫరా చేయనున్నట్లు తెలిపారు. ప్రతి హాస్టల్‌లోనూ మెస్ మేనేజ్‌మెంట్ కమిటీలను ఏర్పాటు చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు మృతి చెందడం బాధాకరమని, బాధ్యతాయుతంగా పని చేయని అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. మృతిచెందిన విద్యార్థుల తల్లిదండ్రులకు ఎంత బాధ ఉంటుందో అర్థం చేసుకోవాలన్నారు. చేవెళ్ల నియోజకవర్గంలో రోడ్లు అధ్వానంగా మారాయని, రోడ్ల అభివృద్ధికి రూ.500 కోట్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పంచాయతీ రాజ్ రోడ్లకు రూ.300 కోట్లు, ఆర్అండ్‌బీ రోడ్లకు రూ.200 కోట్లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మహిళా కమిషన్ చైర్ పర్సన్ శోభారాణి, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, సాంఘిక సంక్షేమ అభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి శ్రీధర్, గురుకుల విద్యా సంస్థల కార్యదర్శి అలుగుల వర్షిణి, కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, చేవెళ్ల ఆర్డీవో చంద్రకళ, తహసీల్దార్ గౌతంకుమార్, ఎంఈవో వెంకటయ్య, గురుకుల విద్యా సంస్థ ఓఎస్డీ శర్మ, పాఠశాల ప్రిన్సిపాల్ దేవేందర్, రాష్ట్ర నాయకుడు షాబాద్ దర్శన్, మాజీ సర్పంచ్‌లు స్వరూప, ప్రవీణ్‌కుమార్, నాయకులు మహేందర్‌ముదిరాజ్, రాంరెడ్డి, రాజుగౌడ్, గడ్డం వెంకట్‌రెడ్డి, ఈగ రవీందర్‌రెడ్డి, నిర్దుల విష్ణేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సభలో పాల్గొన్న విద్యార్థులు, అధికారులు

## అటు వేదన

**అధికారుల నిర్లక్ష్యం.. అధ్వాన భోజనమే కారణమని తల్లిదండ్రుల ఆగ్రహం**

**ఆరోగ్యం బాగానే ఉందంటూ దవాఖానలోనే ఎందుకు ఉంచుతున్నారంటూ డాక్టర్ల నిలదీత**

**తమ పిల్లలను చూడనివ్వలేదు.. నాణ్యమైన వైద్యం అందించలేదని ప్రభుత్వ వైఖరిపై ధ్వజమెత్తుతున్న బాధిత విద్యార్థుల తల్లిదండ్రులు**



తాండూరు జిల్లా దవాఖానలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

# ఆరోగ్యంపై ఆందోళన

తాండూరు పట్టణంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో నాసిరకం ఆహారం తినడం వల్ల పది మంది విద్యార్థినులు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. ఇందులో తొమ్మిది మంది విద్యార్థినులను తాండూరు జిల్లా దవాఖానకు తరలించి మాతాశిశు విభాగంలో చికిత్స అందిస్తుండగా, నీలావతి అనే విద్యార్థిని హైదరాబాద్‌లోని నిమ్స్ దవాఖానలో చికిత్స పొందుతున్నది. శనివారం విద్యార్థినుల తల్లిదండ్రులను మీడియా పలుకరించింది. విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితి ఎలా ఉన్నదని అడుగగా వారు కన్నీటిపర్యంతమయ్యారు. నాలుగు రోజులుగా వైద్యం అందిస్తున్నా తమ పిల్లలు కోలుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్లను అడిగితే ఆరోగ్యం మెరుగుపడుతున్నదని చెబుతున్నారని, బాగుంటే దవాఖానలో ఎందుకు ఉంచుతున్నారని డాక్టర్లను నిలదీశామన్నారు. అస్వస్థతకు గురైన రోజే దవాఖానలో చేర్చితే ఇప్పటికే కోలుకునేవారని, అధికారులు నిర్లక్ష్యం చేశారని విలపించారు. ఎంత బతిమిలాడినా మా పిల్లలను చూపించలేదని, పాఠశాలలో నాణ్యమైన వైద్యమూ అందించలేదని ఆరోపించారు. పరిస్థితి విషమించడంతోనే దవాఖానకు తీసుకొచ్చారని, తమ పిల్లలకు ఏమైనా అయితే ప్రభుత్వానిదే బాధ్యత అని ఆగ్రహం వ్యక్తం చేశారు. భోజనం సరిగా పెట్టడం లేదని తమ పిల్లలు చెబితే... హాస్టల్ వార్డెన్‌కు చెప్పినా స్పందించలేదని వాపోయారు. ఇదిలా ఉండగా విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్లను అడుగగా చికిత్స అందిస్తున్నామని, ఆరోగ్యం కొంత మేర మెరుగుపడుతున్నదని చెప్పారు.

– తాండూరు, డిసెంబర్ 14

### పిల్లలు అవస్థ పడుతుంటే చూడలేకపోతున్నా..



సర్కారు హాస్టల్‌లో చదువు, భోజనం బాగుంటుందని నమ్మి చేర్పించా. ఇలా ప్రాణాల మీదకు వస్తదనుకోలె. నాలుగు రోజులుగా తిండి తినబుద్ధి కావడంలేదు. నిద్ర వస్తలేదు. పిల్లలు పడుతున్న బాధను చూడలేకపోతున్నా. మొదటి రోజే దవాఖానకు తీసుకొస్తే బాగుండేది. నా బిడ్డను చూద్దామని వెళితే లోనికి పంపించలే. హాస్టల్ వార్డెన్, సిబ్బందిని కఠినంగా శిక్షించాలి.

– జయరాం, విద్యార్థిని తండ్రి, బషీర్‌మియాతండా

### మా ఉసురు ముడుతది..



ప్రైవేటు బడిలో చదివించలేక హాస్టల్‌లో వేసినం. హాస్టల్‌లో తిండి సరిగా లేక నరకం అనుభవిస్తున్నరని అనుకోలె. పిల్లలు ఏడుస్తుంటే తట్టుకోలేక పోతున్నా. కేసీఆర్ ప్రభుత్వంలో హాస్టళ్లలో చదువు, భోజనం బాగుండే. కాంగ్రెస్ సర్కార్ వచ్చింది.. హాస్టళ్ల పిల్లలు గోస పడుతుండ్రు. ఈ సర్కారుకు, హాస్టల్ సిబ్బందికి మా ఉసురు ముడుతది. బాధ్యులను కఠినంగా శిక్షించాలి.

– రేణుక, విద్యార్థిని తల్లి, అడికిచర్ల



# కాంగ్రెస్‌లో వర్గపోరు

**సీఎం ప్రోగ్రాంలో బహిర్గతం.. కార్యక్రమానికి ఓ వర్గం దూరం**

**స్థానిక ఎమ్మెల్యే నుంచి సమాచారం లేదంటున్న భీంభరత్ వర్గం**

మొయినాబాద్, డిసెంబర్ 14 : ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని సంక్షేమ వసతిగృహాలు/పాఠశాలలు/కళాశాలల్లో కామన్ డైట్ మెనూ కార్యక్రమా న్ని శనివారం పండుగలా ప్రారంభించింది. అదేవిధంగా మండలంలోని చిలుకూరు గ్రామంలో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల/కళాశాలలో జరిగిన కామన్ డైట్ మెనూ కార్యక్రమాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ ప్రోగ్రామ్‌లో ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డితోపాటు స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్యతో అతడి వర్గం మాత్రమే పాల్గొన్నది. అయితే కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఇన్‌చార్జి భీంభరత్ ఈ కార్యక్రమంలో కనిపించకపోవడంతో స్థానికంగా చర్చ మొ దలైంది. ముఖ్యమంత్రి కార్యక్రమం మధ్యాహ్నం 12:30 గంటలకు ఉం టే వాట్సాప్ గ్రూప్‌లో ఉదయం 10 గంటలకు పెట్టారని.. కనీసం ఫోన్ చేసి చెప్పలేదని భీంభరత్ వర్గం ఆవేదన వ్యక్తం చేసింది. ఎమ్మెల్యే కాలె యాదయ్య, భీంభరత్ మధ్య పొసగడంలేదని.. సీఎం ప్రోగ్రామ్‌లో ఆ వర్గపోరు బహిర్గతమైందని పలువురు చర్చించుకుంటున్నారు. సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఏ వర్గానికి చెందిన వారు వారే లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నారని.. చేవెళ్ల కాంగ్రెస్ పార్టీలో ఎవరికి వారు యమునా తీరే అనేలా ఉన్నదని పేర్కొంటున్నారు. ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మధ్య వర్గపోరు ఉండడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎటూ తేల్చుకోలేక సతమతమవుతున్నారు.

# మెట్రో స్టేషన్లపై తర్జనభర్జనలు

**ఫేజ్ - 2లో మారుతున్న స్టేషన్ల సంఖ్య**

సిటీబ్యూరో, డిసెంబర్ 14(నమస్తే తెలంగాణ) : ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన మెట్రో ఫేజ్–2లో స్టేషన్ల సంఖ్యపై హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో అథారిటీ తర్జన భర్జనలు పడుతున్నది. 76.4 కిలోమీటర్ల, 54 స్టేషన్లతో నిత్యం 8 లక్షల మంది ఐదు కారిడార్లలో ప్రయాణించేలా డీపీఆర్ సిద్ధం చేశారు. తాజాగా కొన్ని మార్గాల్లో స్టేషన్లను తగ్గించే యోచనలో మెట్రో ఉన్నట్లు తెలిసింది. దీని ద్వారా ఆయా మార్గాల్లో మెట్రో వేగం పెరుగుతుందని చెబుతుండగా, ప్రస్తుతం ఉన్న కారిడార్లలో గంటకు 35 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుండగా, భవిష్యత్‌లో ఈ వేగం మరో ఐదు కిలోమీటర్లు పెరుగుతుందని భావిస్తున్నారు. అయితే ఇప్పటికే డీపీఆర్‌ను కేంద్రానికి సమర్పించారు. ఈ క్రమంలోనే మెట్రో స్టేషన్ల కుదించాలా? వద్దా అనే అంశంలో హెచ్ఏఎంఎల్ సమాలోచనలు చేస్తున్నది.

**రూ. 24.3వేల కోట్ల అంచనా వ్యయంతో..**

దాదాపు రూ. 24.3వేల కోట్ల అంచనా వ్యయంతో మెట్రో ఫేజ్–2 చేపట్టనున్నారు. 54 స్టేషన్లను ప్రతిపాదించారు. ఇందులో ప్రధానంగా కారిడార్–4లో ఉన్న నాగోల్–శంషాబాద్ మెట్రో మార్గంలో 24 స్టేషన్లు ఉండగా, 13.4 కిలోమీటర్లు ప్రయాణించే కారిడార్–7లో మియాపూర్–పటాన్‌చెరులో 10 స్టేషన్లు ఉన్నాయి. ఈ రెండు మార్గాల్లో ప్రధానమైన ఎయిర్‌పోర్టు మెట్రో విషయంలో వేగాన్ని పెంచేందుకు స్టేషన్లను కుదించాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. కానీ దీంతో భవిష్యత్‌లో ఈ మార్గంలో కొత్త మెట్రో స్టేషన్ల నిర్మాణం సాధ్యం కాదనే క్రమంలో.. ఆచితూచి అడుగులు వేస్తున్నారు.

**మార్పులు జరిగే అవకాశం..**

ప్రస్తుతం 54 స్టేషన్లతో డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టును హెచ్ఏఎంఎల్ రూపొందించి కేంద్రానికి అందజేసింది. ప్రస్తుతం కేంద్ర పరిశీలనలో ఉంది. డీపీఆర్ అధ్యయనం, పరిశీలన తర్వాత కేంద్రం పలు సూచనలు చేసే అవకాశం ఉంటుంది. ఇదే సమయంలో ప్రాజెక్టు అంచనా వ్యయం, స్టేషన్లు, భూ సేకరణ వంటి అంశాలపై కేంద్ర సూచనలకు అనుగుణంగా మార్పులు జరిగే అవకాశం ఉంటుంది. ఆ లోపే మెట్రో స్టేషన్లను కుదించి, తుది ఆమోదం కోసం రివైజ్డ్ డీపీఆర్ సిద్ధం చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం మెట్రో స్టేషన్ల కుదింపు అంశంపై మెట్రో వర్గాల్లోనే భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా ప్రాజెక్టు నిర్మాణం వ్యయం కూడా తగ్గనున్నది. కానీ భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని స్టేషన్ల నిర్మాణం జరగాల్సి ఉంటుంది. స్టేషన్ల సంఖ్యను కుదించాలని మెట్రో భావించడంపై ఆయా ప్రాంతాల్లో పెదవి విరుస్తున్నారు. తమ ప్రాంతానికి రవాణా సదుపాయాలను కోల్పోయే ప్రమాదం ఉంటుందని, ప్రతిపాదిత అలైన్‌మెంట్ ప్రకారమే మెట్రో స్టేషన్లను ఏర్పాటు చేయాలని నగరవాసులు కోరుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

# గ్రూప్-2కు పకడ్బందీ ఏర్పాట్లు

**నేడు, రేపు పరీక్షలు.. వికారాబాద్ జిల్లావ్యాప్తంగా 30 పరీక్షా కేంద్రాలు**

**అర గంట ముందే కేంద్రాల గేట్ల మూసివేత.. కలెక్టర్ ప్రతీక్ జైన్**

వికారాబాద్, డిసెంబర్ 14 : నేడు, రేపు జరిగే టీజీపీఎస్సీ గ్రూప్ –2 పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలు నుంచి చీఫ్ సూపరింటెండెంట్లు, రూట్ ఆఫీసర్స్, ఇన్విజిలేటర్లు, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ అధికారులతో కలిసి కలెక్టర్ జూం మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రూప్–2 పరీక్షల నిర్వహణకు జిల్లాలో 30 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వికారాబాద్ రీజియన్ పరిధిలో 19, తాండూరు రీజినల్ పరిధిలో 11 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 10,381 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో మూడు 4401, 4402, 4404 (పీడబ్ల్యూడీ) సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇన్విజిలేటర్లు, శాఖాపరమైన అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తమ విధులను సక్రమంగా నిర్వహించాలన్నారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ విధించాలన్నారు. ఈ నెల 15, 16 తేదీల్లో ఉదయం 10 నుంచి 12:30 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు పరీక్షలు ఉంటాయన్నారు. పరీక్షా కేంద్రంలోకి ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లకు అనుమతి లేదన్నారు. పరీక్ష ప్రారంభానికి అరగంట ముందే గేట్లు మూసివేస్తామన్నారు. ప్రభుత్వ గుర్తింపుకార్డును వెంట తెచ్చుకోవాలని అభ్యర్థులకు సూచించారు. సమావేశంలో అదనపు ఎస్పీ టీవీ హనుమంత రావు, అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్, ఆర్డీవో వాసు చంద్ర, పబ్లిక్ సర్వీస్ రీజినల్ కోఆర్డినేటర్ నరేంద్ర కుమార్, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ నేమత్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.



పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న పోలీసు అధికారులు

## రంగారెడ్డి జిల్లాలో 90 కేంద్రాల ఏర్పాటు

**పరీక్షలు రాయనున్న 56,883 మంది అభ్యర్థులు**

రంగారెడ్డి, డిసెంబర్ 14 (నమస్తేతెలంగాణ) : నేడు, రేపు జరుగనున్న గ్రూప్–2 పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ నారాయణరెడ్డి శనివారం తెలిపారు. పరీక్షల నిర్వహణ కోసం జిల్లావ్యాప్తంగా 90 కేంద్రాలను ఏర్పాటు చేశామని, 56,883 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కానున్నారని పేర్కొన్నారు. 15, 16వ తేదీల్లో ఉదయం 10 నుంచి 12:30 వరకు మొదటి పేపర్, మధ్యాహ్నం 3 నుంచి 5:30 గంటల వరకు రెండో పేపర్ పరీక్షలు ఉంటాయన్నారు. అభ్యర్థులు గంట ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదని తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో జిరాక్స్ సెంటర్లు మూసివేయడంతోపాటు 144 సెక్షన్ అమలులో ఉంటుందని మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి తెలిపారు.